

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

సోమవారం,4 ఆగస్టు 2025

8 పేజీలు


## ఆకివీడు-దిగమర్రు గ్రీన్‌ఫీల్డ్

# జాతీయ రహదారికి గ్రీన్ సిగ్నల్

**- ఫలించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కృషి**




**భీమవరం,మేజర్‌న్యూస్ :** నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంతో కీలకమైన ఆకివీడు-దిగమర్రు ఎన్‌హెచ్ -165 ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సంవత్సరమే (ఎఫ్‌వై 2025-2026) ఈ ప్రాజెక్ట్ పనులను ప్రారంభిస్తామని కేంద్ర రోడ్డు రవాణా,రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళగిరిలో కీలక ప్రకటన చేశారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అభ్యర్థన మేరకు రూ.2,500 కోట్ల అంచనా వ్యయంతో 45కిలోమీటర్ల పొడవైన గ్రీన్‌ఫీల్డ్ జాతీయరహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈప్రాజెక్ట్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మంగళగిరిలో జరిగిన సభలో ప్రకటించడం పట్ల కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తన కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 10నెలలుగా ఈప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకు వెళ్లేందుకు తాను చేసినకృషిఫలించిందని, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి కీలకమైన ఆకివీడు-దిగమర్రు ఎన్‌హెచ్-165కు అనుమతులు సాధించేందుకు కేంద్ర మంత్రి నితిన్

- తరువాయి 2లో..





# శివదేవుని చిక్కాలలో రూ.13 లక్షలతో స్మశాన వాటిక పునర్నిర్మాణం..

**- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** మండలంలో శివదేవుని చిక్కాల గ్రామం నందు రూ.13 లక్షలతో స్మశాన వాటిక పునర్నిర్మాణం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు,జలవనరులశాఖమంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ తరపున నిమ్మల రామా రావు తన కుమారుడి పేరుట గ్రామంలో అనేక మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారని, అనంతరం మిషన్లు అందజేశారు. అలాగే మెడికల్ క్యాంపులు నిర్వహించి గ్రామఅభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డెడ్లమణి వజ్రం, కోపరేటివ్ సొసైటీ సహకార సంఘ చైర్మన్ వడ్డే సోమశేఖర్, పాముల రజిని,ఉన్నమట్ల కపర్ది,వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ తెలుగు చిత్ర బృంధానికి శుభాకాంక్షలు..

- నటుడు నందమూరి బాలకృష్ణకు నా ప్రత్యేక కృతజ్ఞతలు
- రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పార్థసారధి



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** 71,వ జాతీయ చలన చిత్ర అవార్డుకు,ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైన భగవంత్ కేసరి చిత్రబృందానికి,నటుడు నందమూరి బాలకృష్ణ,దర్శకుడు ఆర్,అనిల్,నిర్మాతలు సాహు, హరీష్, నటీనటులు, సాంకేతిక బృందానికి,రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు వారి సత్తా ఏమిటో చూపించి జాతీయ, అంతర్జాతీయ,స్థాయిలో రాణించి,తెలుగు చిత్రాలకు అవార్డుల, రికార్డుల వర్షం కురిపించి, తెలుగు జాతి ఖ్యాతిని జాతీయ,అంతర్జాతీయస్థాయిలో నిలబెడుతున్న తెలుగుచిత్ర పరిశ్రమకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు, అభినందనలు

- తరువాయి 2లో..

## అగ్ని మాపక అధికారుల సేవలు ఎనలేనివి

**- అగ్నిమాపక భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ,మండలి చైర్మన్**





**భీమవరం,మేజర్‌న్యూస్ :** సుమారు రూ 2 కోట్లలతో జిల్లా అగ్ని మాపక కేంద్ర కార్యాలయాన్ని భీమవరం లో ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యేపులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ. 2కోట్లతో అగ్నిమాపక కేంద్రం,జల అగ్నిమాపక కార్యాలయ భవనానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు,ఎమ్మెల్యే అంజిబాబు,ఇన్‌ఛార్జ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తరువాత అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని,అందులో మొదటిగా అగ్ని మాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమన్నారు. శాసన మండలి చైర్మన్ కోయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ

- తరువాయి 2లో..

## భక్తులతో పోటెత్తిన చిన్న వెంకన్న ఆలయం

**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్య క్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయం భక్తలతో పోటెత్తింది. శ్రావణమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో వేకువజాము నుండి భక్తులు క్యూ లైన్ లో క్యూలు కట్టారు. శేషాచల కొండభక్తుల వాహనాలతో కిక్కిరిసింది. కేశఖండన క్యూలైన్లు,టికెట్ కౌంటర్లు దర్శనం క్యూలైన్లు, అనివేట్ కళ్యాణ మండపం ఆవరణ, ప్రసాదం కౌంటర్లు, భక్తులతో పోటెత్తాయి. ఆలయ అధికారులు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆలయ ఈ ఓ ఎన్‌వి సత్యనారాయణమూర్తి భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**- మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు విస్తరణ**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను ఈ నెల 4వ తేదీ సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబడుతున్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. ఇదిద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో,డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చు. అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: https://meekosam.ap.gov.in ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితితదితర సమాచారం

- తరువాయి 2లో..

# సహృదయత కలిగిన గొప్ప స్నేహ శీలి ప్రముఖ సాహితీవేత్త,వ్యాఖ్యాత బందా



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రముఖ సాహితీవేత్త,వ్యాఖ్యాత, రసన సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి వి.బందా సంతాప సభను సాహిత్య మండలి, గరికిపాటి ఆర్ట్స్,హేలాపూరి కళా పరిషత్, జిల్లా రచయితల సంఘం మొదలుగు సాహిత్య,కళా సంస్థల ఆధ్వర్యంలో జరిగింది.సంతాప సభకు అధ్యక్షత వహించిన డా.లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహృదయత కలిగిన గొప్ప స్నేహ శీలి మంచి సాహితీవేత్త,ప్రజాస్వామిక వాది బందా అని,కళల పైన,సంగీతం పైన జ్యూట్ మిల్లు సాంకేతికత పైన సాధికారికంగా రచన చేయగలిగిన అసాధారణ ప్రతిభావంతుడు అని ఆయన రచనల్లో మురళీ మాధురి,రవి వర్మ,సర్ ఆర్థర్ కాటన్ మొదలైన గ్రంథాలు శిఖరాయ మానమైనవి అని అన్నారు. గరికిపాటి కాళిదాసు మాట్లాడుతూ ప్రవచన కారుడు గరికపాటి నరసింహారావు ద్విశత అవధానం కార్యక్రమంను బందా నేతృత్వంలో నిర్వహించడంజరిగిందని అన్నారు. లేళ్ళ వెంకటేశ్వరావు మాట్లాడుతూ పారిశ్రామిక శిక్షణా సంస్థకు ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ,సాహిత్య కళా కార్యక్రమాలకు సభా సంచాలనం నిర్వహించి వ్యాఖ్యానంకు గొప్ప గుర్తింపును తీసుకొచ్చిన సాహితీవేత్త బందా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత మహమ్మద్ ఖాజావలి,నాగాస్త్ర, పుల్లాభొట్ల పురుషోత్తం,సత్యవాణి,పి.ఆంజనేయులు, సూర్య ప్రకాష్ మొదలగువారు ప్రసంగించారు.

# క్రమబద్ధీకరణకు మార్గదర్శకాల విడుదల




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జి.ఒ.ఎం.ఎస్ నెం. 134, తేది: 26.07.2025 ద్వారా గతములో జి.ఒ.ఎం.ఎస్ నెం.10, తేది: 08.01.2020 నందు జారీ చేయబడిన ఆంధ్రప్రదేశ్ అనధికార లే-అవుట్లు మరియు ప్లాట్ల క్రమబద్ధీకరణ నియమాలు, 2020కి కొన్ని సవరణలు చేయబడినది. తేది:30.06.2025 లోపు రిజిష్టర్ కాబడిన అనధికార లే-అవుట్లు / ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జి.ఒ.ఎం.ఎస్ నెం. 134, తేది: 26.07.2025 జారీ చేసిన నాటి నుండి 90 రోజుల (తేది:24.10.2025) లోపు క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసికొనవలసినదిగా మార్గదర్శకాలను విడుదల చేయడమైనది.

కావున, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, కాకినాడ పరిధిలో, పైన తెలిపిన అర్హత కలిగిన అనధికార లే-అవుట్ల యాజమనులందరూ / అనధికార లే-అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన యాజమానులందరూ, తమ అనధికార లే-అవుట్లు / ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు ఎల్.ఆర్.ఎస్. పోర్టల్ (https://dtcp.ap. gov.in/LRS/) నందు నేరుగా సిటిజన్ లాగిన్ నుండి లేదా కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, కాకినాడ నందు లైసెన్స్ పొందిన ఎల్.టి.పి. ల ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకొనవలసినదిగా తెలియచేయడమైనది. క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసికొన్నవారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50% రాయితీ పొందుతారు మరియు 45 రోజుల (తేది:19.09.2025) లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే, పెనాల్టీ చార్జీలపై 5% తగ్గింపును పొందుతారు. అంతేకాకుండా, 4,000 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు ప్రభుత్వ రహదారి / ఇప్పటికే ఉన్న రహదారి సదుపాయం కలిగి, అనధికార లే-అవుట్లలో భాగం కానట్లయితే, వాటిని కూడా క్రమబద్ధీకరించుకొనుటకు అవకాశం కలదు మరియు పైన తెలిపిన రాయితీలను పొందవచ్చు.పైన తెలిపిన విధముగా అనధికార లే-అవుట్లు / ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనక పోయిన యెడల, అటువంటి అనధికార లే-అవుట్లు / ప్లాట్లు నిరంతర నేరంగా పరిగణించబడతాయి మరియు చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. సదరు అనధికార లే-అవుట్లు / ప్లాట్లకు విద్యుత్, త్రాగు నీటి సరఫరా, డ్రైనేజీ మొదలగు వసతులు కల్పించడవు మరియు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. అంతేకాక, సదరు అనధికార లే-అవుట్లు / ప్లాట్లు రిజిస్ట్రేషన్ శాఖ యొక్క నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు చేయబడతాయి మరియు అమ్మకం / కొనుగోలు లేదా ఇతర లావాదేవీలు జరపడం సాధ్యపడదు.

కావున, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, కాకినాడ పరిధిలోని అర్హత కలిగిన అనధికార లే-అవుట్లు / ప్లాట్ల యజమానులందరూ, తేది:24.10.2025లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని, మీ యొక్క అనధికార లే-అవుట్లు / ప్లాట్ల క్రమబద్ధీకరణకై ప్రభుత్వమువారు కల్పించిన సదావకాశాన్ని మరియు రాయితీలను సద్వినియోగించ్చుకొని, ప్రణాళికాబద్ధమైన ప్రగతికి సహకరించవల సినదిగా కోరడమైనది. ఏమైనా సందేహములు / సమాచారము నిమిత్తము హెల్ప్ డెస్క్ నెం.85004 79756, 9676835871 (లేదా) కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, కాకినాడ కార్యాలయన్ని పని వేళల యందు సంప్రదించవలసినదిగా తెలియచేయడమైనది.

# బిసి సంక్షేమ హాస్టల్స్ తనిఖీ





**– రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సంచాలకులు చంద్రశేఖర రాజు**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరులోని బిసి సంక్షేమ హాస్టల్స్ను ఆదివారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సంచాలకులు డి.చంద్రశేఖరరాజు తనిఖీ చేశారు. ఏలూరులోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు బి.సి బాలికల వసతి గృహము నెం:1,2 కళాశాల వసతి గృహం 1,2లను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనములు, రికారులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్లీన్ అండ్ గ్రీన్ కార్య క్రమంలో పాల్గొన్నారు.వీరి వెంట జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అర్.వి.నాగరాణి,సహాయ బీసీ సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## ఆకివీడు-దిగమర్రు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి గ్రీన్ సిగ్నల్

మొదటిపేజి తరువాయి

గడ్కరీని పలు దఫాలుగా కలిసి ఈప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను తెలియ జేయడంతోపాటు జాతీయ స్థాయిలో డీజీ,ఎన్‌హెచ్ ఏఐ ఉన్నతాధికారులను కలిసి ప్రాజెక్ట్ టెక్నికల్ సమస్యలను పరిష్కరించి,తిరిగిసర్వే చేయించడం, అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించడం జరిగింద న్నారు.ఈప్రాజెక్టు నిర్మాణానికి సానుకూలంగా స్పందించి అనుమతి ఇచ్చి సహకరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ ఉత్తమ తెలుగు చిత్ర బృంధానికి శుభాకాంక్షలు..

మొదటిపేజి తరువాయి

తెలియజేస్తున్నానని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. భవిష్యత్తులో నిర్మించే చిత్రాలు, స్ఫూర్తి దాయకమైన, కథలు, మరింత శక్తివంతమైన కధాచిత్రాలు నిర్మించి, జాతీయ తెలుగు చిత్రఅవార్డులు, అంతర్జాతీయ ఆస్కార్ అవార్డులు పొందాలని ఆకాంక్షిస్తు న్నానని మంత్రి తెలిపారు.

## అగ్ని మాపక అధికారుల సేవలు ఎనలేనివి

మొదటిపేజి తరువాయి

ఈ ప్రాంతానికి అభివృద్ధికి సూచక అని, ప్రకృతి వైపరీత్యాలు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు సమాజానికి అగ్ని మాపక అందిస్తున్న సేవలు అద్వితీయమని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేలా ఈ కేంద్రంలో మొక్కలను కూడా పెంచాలని అన్నారు.పట్టణంలోని నాలుగు పక్కల ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అంజిబాబు,ఇన్ ఛార్జ్ కలెక్టర్ రాహుల్ ను మోషెన్ రాజు కోరారు.కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు,కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

మొదటిపేజి తరువాయి

తెలుసుకోవాలంటే,1100టోల్‌ఫ్రీనంబర్‌కు కాల్ చేయవచ్చు.ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి,సమయానుకూలంగా పరిష్కారమవుతా యని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.


## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి అండగా అంబుల వైష్ణవి



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :**ముదినేపల్లి మండలం పెద్దకోమరు గ్రామానికి చెందిన పాస్టర్ చలపాక గిద్యో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది.

అంత్యక్రియలకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని విషయాన్ని తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి వెంటనే స్పందించి వారి తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. మృతి చెందిన వ్యక్తికి ఒక కుమార్తె కూడా స్వల్ప అనారోగ్యంతో ఉండగా కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని డాక్టర్ మనోజ్ తెలిపారు.

# 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు





**– విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దు : సిపిఐ గూగుల్ మీట్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, ఇప్పటికే ప్రజలపై మోపిన విద్యుత్ బారాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమాలలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నుండి జరిగిన జిల్లా కార్యవర్గ విస్తృత గూగుల్ సమావేశం విద్యుత్ భారాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించింది. గూగుల్ సమావేశానికి జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. జిల్లా ఇన్చార్జి,జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ గూగుల్ మీట్‌లో మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పార్టీలు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని ఇచ్చిన హామీని విస్మరించి,గత ఏడాది కాలంగా వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపిందని ఆమె విమర్శించారు. ఆగస్టు 5వ తేదీ మంగళవారం నాడు ఏలూరు జిల్లాలో విద్యుత్ కేంద్రాల వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె కోరారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర మహాసభలు సందర్భంగా ఆగస్టు 8వ తేదీన ఏలూరులో జిల్లా సమగ్ర అభివృద్ధిపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభకు ఏలూరు జిల్లా నుండి పార్టీ ,ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు వందలాదిమంది ఒంగోలు తరలి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆయన వివరించారు. గూగుల్ మీటింగ్‌లో జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మున్నీరు, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం ధారయ,బాడిశ రాము,కోన్నే లక్ష్మయ్య, వరక శ్యామల, తొర్లపాటి బాబు, జిల్లా సమితి సభ్యులు టీవీఎస్ రాజు, చాట్ల పుల్లారావు, టి ఆంజనేయరాజు, బి.ఎన్. సాగర్, మన్నవ యామిని, గోలిమేబాలయేసు,కంచర్ల గురవయ్య,కూరాకుల బాబురావు పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణానికి మోక్షం





**పెంటపాడు,మేజర్‌న్యూస్ :** పెంటపాడు మండలం రాచర్ల గ్రామానికి మూడు రహదారులు ఉండగా ఒకటి అలంపురం నుండి రాచర్ల వెళ్లే మార్గం. మరొకటి పెంటపాడు నుండి దర్శిపరు, వల్లూరుపల్లి మీదుగా రాచర్ల వెళ్లే రహదారి. మూడవది ఫుడ్ ఫ్యాక్స్ పక్కనుండి పొలాల మధ్య నుండి తక్కువ సమయంలో వెళ్లే మార్గం. వ్యవసాయ పొలాలు రోడ్డుకి ఇరువైపులా ఉండడం,కొంతకాలంగా రోడ్డుకి ఇరువైపులా పారిశ్రామిక సంస్థలు ఏర్పాటు కావడం ఈ రహదారి నామమాత్రపు మరమ్మత్తులు మాత్రమే ప్రజల కోరిక మేరకు ఇప్పుడు ఈ రహదారికి శాశ్వతమోక్షంలభించి ఈ రహదారిని పూర్తిస్థాయిలో ఆధునికరించేందుకు పనులు మొదలుపెట్టారు.

## అదనపు కట్నం కోసం అత్తవారింట్లో వేధింపులు : కేసు నమోదు

**ఉండి,మేజర్ న్యూస్ :** వివాహం జరిగిన నాటి నుండి అన్యోన్యంగా భార్య భర్తలు ఇద్దరూ ఒకే మాట మీద కలిసి ఉండి ఎంతో ఆనందంగా గడుపుతున్న ఈ రోజుల్లో అదనపు కట్నం కోసం అత్తవారు వేధిస్తున్న దుర్ఘటన ఉండి గ్రామంలో చోటుచేసుకుంది. ఉండి కి చెందిన తాడి వెంకటరమణ చిన్న కుమార్తె తాడి వసంతకు భీమవరం మండలానికి చెందిన ఆల్తి రమేష్‌తో గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. సంవత్సరకాలం ఇరువురు బాగున్నప్పటికీ కుటుంబంలో ఉన్న అత్త ,బావ,తోడి కోడలు అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నప్పటికీ కొంతకాలం భరించి తల్లిదండ్రులతో విషయం చెప్పింది. దీనితో ఆమె భర్త ఆల్తి రమేష్,అత్త, బావ,తోడికోడలు, పై ఉండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై వరకట్న నిరోధక చట్టం కింద 498 కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మరొక హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం





**కలిదిండి /కైకలూరు,మేజర్ న్యూస్ :** అన్నదాత సుఖీభవ –పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాలకు నేరుగా 7వేల రూపాయలు జమ చేయు సందర్భంగా కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటంనకు అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటమునకు కూటమి నాయకులు రైతులతో కలిసి పాలాభిషేకం చేసినారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఐదువేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రెండు వేల రూపాయలు మొత్తం 7వేల రూపాయలు లబ్ధిదారులైన రైతులకు అందజేశారు. ఎన్నికల్లో వచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసిందిన్నారు. మూడు విడతలగా ఏడాదికి 20వేల రూపాయలను రైతులు ఖాతాలో జమ చేసేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతన్నలు చంద్రన్న పాలనలో అభివృద్ధి చెందుతుందన్నారు. జగన్ పాలనలో నిర్లక్ష్యం చవిచూసినా రైతులకు ఇప్పుడు చంద్రన్న పాలనలో భరోసా లభిస్తుందని రైతులకు అందిస్తున్న సహాయం రైతులకు ఇచ్చే ఆత్మగౌరవంగా కూటమి ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆండ్రాజు శ్రీనివాస్ రావు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లంక రత్నారావు,అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడగ జంగాలను ఎస్సీ జాబితాలో తిరిగి చేర్చాలి : కమ్యూనిస్టుల డిమాండ్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** బడగ జంగాలను ఎస్సీ జాబితాలో తిరిగి చేర్చాలని వారికి సామాజిక న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉంటుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు అన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం చినతాడేపల్లి లో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి, ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు, రాజ్యాంగ స్వయం ప్రతిపత్తి సంస్థలను నిర్వీర్యం చేస్తూ సాగిస్తున్న అప్రజాస్వామిక విధానాలుపైన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు ముఖ్యంగా పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న హామీ అమలు తదితర అంశాలపై చర్చించి మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని మహాసభలు విజయవంతానికి అందరూ సహకరించాలని కలిశెట్టి కోరారు. సిపిఐ తాడేపల్లిగూడెం పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ చినతాడేపల్లిలో 70 జంగాల కుటుంబాలు పార్టీలో చేరడానికి ముందుకు రావడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం రూరల్ కార్యదర్శి ఉల్లింగల జయకృష్ణ,ఒంటెద్దు పెద్దిరాజు,ఒంటెద్దు ముత్యాలు, టేకు ఏసు,కల్యాణ వెంకటరత్నం, కల్యాణ దుర్గారావు,చింతాలు,ఊర అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## అమ్మానాన్న ట్రస్ట్‌చే రోగులకు దుప్పట్లు,పండ్లు,బ్రెడ్లు పంపిణీ





**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం, కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మానాన్న ట్రస్ట్ చైర్మన్ మారం హనుమంత రావు,లాయర్ సురేష్,అందే జగదీష్, బండ్రెడ్డి వాసు,తానింకి గంగాధర్ రావు,అంబికా రఘు,డొక్కు శ్రీను,గార రామకృష్ణ,అందే మహేష్, మారం జై సూర్య,తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి : ఎంపీడీవో



**కుకునూర్,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సప్ గవర్నస్ పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఈనెల 5న ప్రతి సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది గ్రామస్తుల సహాయంతో వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేయాలని ఈ వాట్సప్ గవర్నస్ ద్వారా మన మిత్ర యాప్‌తో సుమారు 530 సేవలు ఉదాహరణకు కులము ఆదాయము నివాస ధ్రువ పత్రము బర్త్ సర్టిఫికెట్ డెత్ సర్టిఫికెట్ ఇలా మొదలైన సర్టిఫికెట్లు అన్నీ కూడా మనమిత్ర యాప్‌తో ఇంటి దగ్గరే ఉండి సేవలు పొందవచ్చని దీని ద్వారా ప్రజలు సమయం వృధా కాకుండా ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానిక ఎంపీడీవో నరసింహారావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఎమ్మెల్యేపై ఆరోపణ చేసి కూటమిని విచ్ఛిన్నం చేయాలనే కుట్ర





**- నియోజకవర్గం నాయకులంతా ఎమ్మెల్యే బాలరాజుకు అండగా ఉంటాం**

**- జనసేన మండల అధ్యక్షులు రాము,జిల్లా కార్యదర్శి రవికుమార్**

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** శాసనసభ్యులు చిర్రి బాలరాజు పై అవినీతి ఆరోపణలను ప్రసారం చేసి కూటమిని విచ్ఛిన్నం చేయాలని కుట్ర జరుగుతుందని అవస్తవాలకు ఏ ఒక్క కూటమి నాయకుడు చెదిరిపోరు అని జీలుగుమిల్లి జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము పేర్కొన్నారు. ఆదివారం జీలుగుమిల్లిలో జనసేన మండల అధ్యక్షులు రాము నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గతంలో ఓ పత్రిక రాసిన తప్పుడు కథనాన్ని గురించి ఏజెన్సీ టైగర్ కరాటం రాంబాబు,మాజీ మంత్రి దేవినేని ఉమా ఫోన్ సంభాషణలో శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఏడాదిలో 100 కోట్లు సంపాదించారని యూట్యూబ్లో చూశానని మాట్లాడుకున్న కొన్ని మాటలను కొన్ని మీడియా సంస్థలలో ప్రసారమైన కథనం అవాస్తమని పేర్కొన్నారు.ఒక్క ఏడాదిలో 100 కోట్లు సంపాదిస్తే గతంలో ఎన్నికైన శాసనసభ్యులు 20ఏళ్ల పాటు పదవులు అనుభవించి సంక్షేమాన్ని అభివృద్ధిని గాలికి వదిలిఎన్ని కోట్లు సంపాదించి ఉంటారు అంటూ ప్రశ్నించారు.ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై అవినీతి ఆరోపణలు ఎంత చేసిన గోడకు కొట్టిన బంతిలా ప్రజాక్షేత్రంలో దూసుకుపోతారని చెప్పారు. జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మాట్లాడుతూ నిరాధార కథనాలను ప్రసారం చేయడమే కాకుండా బాధ్యత గల సీనియర్ నాయకుల మాట్లాడుకున్నట్లు సృష్టించడం తగదని అన్నారు.

మీడియాలో వచ్చిన కథనాలను తాను ఖండిస్తున్నట్లు వెల్లడించారు. పోలవరం శాసనసభ్యులు వెంటా ఏడు మండలాల కూటమి నాయకులు జనసైని కులు అండగా ఉంటామని ఇటువంటి బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి జనసేన టౌన్ అధ్యక్షులు కోలా మధు, పాలజీ దుర్గ ప్రసాద్, కొట్టే శాంతకుమార్ జనసేన నాయకులు పాల్గొన్నారు.

# నేడు కేంద్ర మంత్రి వర్మ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం,ఉచిత వైద్య శిబిరాలు

**- బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి**



**భీమవరం,మేజర్ న్యూస్ :** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ జన్మదినం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా బిజెపి నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలోగల కె.ఎస్.రాజు ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి నాయకులు, బిజెపి శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమం అనంతరం పేద ప్రజలకు ఉపయోగపడేలా భారీ రక్తదాన శిబిరం, కంటి పరీక్ష శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తెలిపారు.పేద ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.మరోవైపు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని భీమవరం పట్టణంలో బిజెపి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రీనివాస వర్మ శ్రేయోభిలాషులు భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం కేఎస్ రాజు ఫంక్షన్ హాల్లో ఏర్పాట్లను బిజెపి నాయకులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు తోట గంగరాజు, కలిదిండి వినోద్ వర్మ, దత్తు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కోరా రామ్మూర్తి, ఇంజేటి వెంకటేశ్వర్లు, నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భద్రతా పథకాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



**పోడూరు, మేజర్ న్యూస్ :** పోడూరు గ్రామంలో సంత మార్కెట్ ,పెద్దపేటలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం క్రింద సామాజిక భద్రతా పథకాలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశం జరిగంది. ఇండియన్ బ్యాంక్, పోడూరు శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి సామాజిక సురక్షా పథకాలను ప్రజలకు వివరించారు. బ్యాంకింగ్ రంగంలో ఇటీవల పెను మార్పులు చోటు చేసుకున్నాయని బ్యాంకు ఖాతాదారులు నగదు రైతు లావాదేవీల పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన , అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల పై ఖాతాదారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. బ్యాంకు పరిధిలోని ప్రజలందరూ ముఖ్యంగా పేద వర్గాలకు చెందిన వారందరూ పీఎం ఆర్థిక భరోసా పథకాలు వినియోగించుకుని కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలన్నారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఎన్ ముని చరణ్ మాట్లాడుతూ సైబర్ స్కామ్లు, ఫిషింగ్ మోసాలు, ఆన్లైన్ బ్యాంకింగ్ సురక్షా చర్యల గురించి కూడా వివరించారు.ప్రజలు తమ ఆర్థికపరమైన డేటాను ఎలా సురక్షితంగా ఉంచుకోవాలనే దిశగా సూచనలు అందించారు. మొబైల్ ఫోన్ కి వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని తద్వారా బ్యాంక్ ఖాతాలోని డబ్బు పోగొట్టుకోవద్దని టెక్నాలజీ పరంగా ముందుకు వెళుతున్నప్పటికీ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా మెలగడం ద్వారా అదుపు చేయడం సులభమే అన్నారు.పోడూరు పరిధిలోని ఇప్పటికే పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని ఎవరైనా కోరితే ఆయా గ్రామాల్లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని బ్యాంక్ మేనేజ్ ప్రకటించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ మిత్ర లు సుశీల, దొంగ పాండురంగ, పుచ్చకాయల వసంత కుమార్,బ్యాంక్ ఖాతా దారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

**- ఎమ్మెల్యే చిర్రి బాలరాజు,**

**రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు**





**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కోటరామచంద్రపురం ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం శనివారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు, చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. అన్నదాత సుఖీభవ -పిఎం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందన్నారు. మొదటి విడతలో రాష్ట్రం రూ.5 వేలు కేంద్రం రూ.2 వేలు చొప్పున రూ.7 వేలు రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల కళ్ళల్లో ఆనందమే కూటమి ప్రభుత్వం లక్ష్య మని చెప్పారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చదువుకున్న నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి అమలుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.ఇప్పటికే మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని మెగా డీఎస్సీ నిర్వహించి సుమారు16,500 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడిఏ బుజ్జిబాబు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రియాంక, నియోజకవర్గంలోని ఏడు మండలాల ఏవోలు,, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిస్వార్థంతో వ్యవహరించే బంధం స్నేహం





**కలిదిండి/కైకలూరు,మేజర్ న్యూస్ :** కలిదిండి గ్రామ పంచాయతీ దగ్గర స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలిదిండి హైస్కూల్లో 92-93 బ్యాచ్ పదవ తరగతి క్లాస్ పూర్వపు విద్యార్థులు అందరూ కలిసి సంతోషంగా కేక్ కట్ చేసిన ఆనందాన్ని సంతోషాన్ని పాలుపంచుకున్నారు. అనంతరం పంచాయతీలోని పదిమంది పారిశుద్ధ్య కార్మికుల కుటుంబానికి 25 కేజీల బియ్యం గుడ్లు. నిత్యవసర సరుకులు పంచి పెట్టడం జరిగింది. ప్రతి స్నేహితుల దినోత్సవం రోజు ఇలాంటి సేవా కార్యక్రమాలు అందరం కలిసి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీప్రసన్న పూర్వపు విద్యార్థులు.పాము వీర వెంకట రవికుమార్.మోటుపల్లి సోమేశ్వరావు. గోదావరి సుబ్రహ్మణ్యం. ఒడిగిన దుర్గాప్రసాద్.లలితా ప్రసాద్.ఆరోగ్య జీవరత్నం. రాంబాబు. జాఫర్ అహ్మద్.రాజిగుప్త తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఎమ్మెల్యేను కాబట్టే అసత్యాలు ప్రసారం చేస్తున్నారా?

– త్వరలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు నివేదిక
: ఎమ్మెల్యే బాలరాజు



జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ : గిరిజనులు నీతి నిజాయితీలకు మారుపేరుగా జీవిస్తారు.గిరిజనుడైన తాను రాజకీయాల్లోకి వచ్చి శాసనసభ్యునిగా నిలవగల సత్తా ఉండటంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తనకు రాజకీయ ప్రవేశం కల్పించి ప్రజా మద్దతుతో ఎమ్మెల్యేగా గెలిపించారు. అయితే తన గెలుపును జీర్ణించుకోలేని కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని శాసనసభ్యులుగా ఎన్నడు అవినీతికి పాల్పడలేదని కావాలనే కొందరు తనపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో తనపై వచ్చిన ఆరోపణలపై ఒక వ్యక్తి కటకటాల పాలయ్యారని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తి ప్రసరించిన కథనాలలో చేసిన మొదటి ఆరోపణ 100 కోట్ల రూపాయలు ఆర్జించానని ప్రచారం చేశాడు.ఆ విషయాన్ని ఇద్దరు సీనియర్ నాయకులు చర్చించుకున్నారని పేర్కొన్నారు.వారు చర్చించుకున్న మాటలను వక్రీకరించి కొన్ని మీడియా సంస్థలు పైశాచిక ఆనందాన్ని పొందుతూ ప్రసారం చేశాయని ఆరోపించారు.ఇద్దరు నాయకులు మాట్లాడుకున్న మాటలను వక్రీకరించిన మీడియా సంస్థలపైన న్యాయస్థానంలో కేసు వేస్తానని అన్నారు. తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని రాజకీయ నాయకులు అవినీతి బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుడునైన తాను ఎన్నడూ అవినీతికి పాల్పడలేదని పాల్పడబోను అని స్పష్టం చేశారు. పోలవరం నియోజకవర్గం వంటి గిరిజన ప్రాంతంలో శాసనసభ్యునిగా ఉన్న నాపై ఏడాదిలో 100 కోట్ల రూపాయలు సంపాది ంచానని చేసిన ఆరోపణలపై ఎటువంటి విచారణకైనా సంసిద్ధంగా ఉన్నానని అన్నారు. తనపై జరుగుతున్న అసత్య ప్రచారంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు నివేదిక సమర్పిస్తానని తెలిపారు.

# కూటమి పాలనపై ప్రభుత్వ సలహాదారి ఎంఏ షరీఫ్ ఆరా



నరసాపురం,మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి పాలన ఎలా ఉంది, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా? తదితర విషయాలపై ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ ఆరా తీశారు. ఆదివారం పట్టణంలోని 28వ వార్డులో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు జరుపుతున్నామని, సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికే పూర్తి చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ మాజీ ఏఎంసీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, ఉల్లంపర్తి సత్యన్నారాయణ,జల్ల నాగేశ్వరరావు, తిరుమాని హేమంత్, దేశెట్టి సత్యన్నారాయణ, దొంగ పద్మారావు,వెలగన రామకృష్ణ,నాగిడి రాంబాబు,తదితరు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో మంత్రి నిమ్మలపై దాడి వెనుక కుట్ర



– అసత్య కథనాలపై టీడీపీ నేతల ఫైర్

పాలకొల్లు,మేజర్ న్యూస్: గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద మంత్రి నిమ్మల రామానాయుడుపై జరిగిన దాడి వెనుక వైసీపీ నాయకుల కుట్ర ఉందని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఈ దాడిని కప్పిపుచ్చుకోవడానికి 'సాక్షి' పత్రిక అసత్య కథనాలు రాస్తోందని వారు తీవ్రంగా విమర్శించారు.వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసి చైర్మన్ కోడి విజయభాస్కర్,టీడీపీ నాయకులు పెచ్చెట్టి బాబు,గండేటి వెంకటేశ్వరరావు, పాముల రజిని కుమార్, మామిడిశెట్టి పెద్దిరాజు,గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, బోనం నాని తదితరులు మాట్లాడారు.వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ కోడి విజయభాస్కర్ మాట్లాడుతూ 2022లో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం అప్పటి స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు,ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ లు వేదిక ఎక్కుతుండగా, వైఎస్సార్సీపీ శ్రేణులు ఉద్దేశపూర్వకంగా అడ్డుకొని దాడికి పాల్పడ్డారన్నారు. మారణాయుధాలను సైతం ఉపయోగించి రామానాయుడును హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించిన వైఎస్సార్సీపీ నేతలు ప్రోటోకాల్ ప్రకారం వేదికపై ఉండాల్సిన అధికార ప్రతినిధులపై దాడి చేసి, ఎటువంటి ప్రోటోకాల్ లేని వారు వేదికపై ఎందుకు ఉన్నారని టీడీపీ నేతలు ప్రశ్నించారు.

**– క్రికెట్ బెట్టింగ్ రాకెట్‌పై ఎందుకు రాయలేదు ? –**

ఆ పత్రిక నిజాలు రాయాలనుకుంటే రాజకీయ ముసుగులో వైఎస్సార్సీపీ నాయకుడు యడ్ల తాతాజీ, అతని సోదరుడు నాగేశ్వరరావు తదితరులు కలిసి కోట్ల రూపాయల క్రికెట్ బుకీ బాగోతం గురించి ఎందుకు రాయలేదని టీడీపీ నేతలు ప్రశ్నించారు. పాలకొల్లు పోలీసుల శాఖ ఈ రాకెట్‌ను రట్టు చేసిన విషయం అందరికీ తెలిసిందేనని వారు గుర్తు చేశారు. ఆ సమయంలో నగదు తో పాటు లాప్ టాప్,సెల్ ఫోన్లు,కార్లు వంటివి స్వాధీనపరచుకున్నారు. విశాఖపట్నం లో కోటి రూపాయల విలువైన విల్లాలోని ఫ్లాట్లో ఉంటూ వేలాది మంది యువత జీవితాలను నాశనం చేసిన క్రికెట్ బుకీల గురించి,వారి వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న యువకుల గురించి 'సాక్షి'కి ఎందుకు కనబడటం లేదని వారు నిలదీశారు.

**– ఐదేళ్ల అధికారమిస్తే ఏం చేశారు ? –**

వైసీపీకి ఐదేళ్ల అధికారం ఇస్తే నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రూ.14 కోట్లతో దమయ్యపర్తి మురుగు కాలువ ప్రక్షాళన, 12 కోట్లతో ఏటిగట్టు పనులు, 23 కోట్లతో కనకాయలంక కాజ్వే వద్ద వంతెన,ప్రభుత్వాసుపత్రి భవనం పూర్తి,డయాలసిస్ కేంద్రం,పూలపల్లి బీసీ కమ్యూనిటీ హాల్ భవనం,అంబేద్కర్ సామాజిక భవనం,ముస్లింల షాది ఖానా , హిందూ స్మశాన వాటిక, బొండాడ వెంకటరాజు గుప్తా, ఎన్టీఆర్ కళాక్షేత్రం, అబ్దుల్ కలాం పార్క్, చంద్రబాబు నాయుడు పార్కు, 15 కోట్లతో పట్నంలో మంచినీటి పథకం,విజ్జేశ్వరం నుంచి తాగునీటి పైపులైన్ పనులు, పంట, మురుగు కాలువల ప్రక్షాళన ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటే కనబడట్లేదా అని ప్రశ్నించారు.

## వైఎస్ పాలెంలో సచివాలయ సిబ్బందికి సత్కారం



నరసాపురం రూరల్,మేజర్ న్యూస్ : మండలంలోనియ ర్రం శెట్టి వారి పాలెం సచివాలయంలో ఐదు సంవత్సరాల సేవ పూర్తి చేసిన సిబ్బంది బదిలీ అయినా సందర్భంగా వారందరిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇటీవల సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ యర్రం శెట్టి నాగ ముత్యమాంబ, బాబులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఈ గ్రామంలో అనేక సేవలందించారు. బదిలీ అయ్యి పనిచేయబోయే ప్రదేశాల్లో కూడా ప్రజలందరికీ పనులు చేసి, అందరి అభిమా నాన్ని పొందాలన్నారు. మా గ్రామంలో నిబంధనల ప్రకారం ప్రజలకు సేవలు అందించారని ఇదే పరిస్థితి కొనసాగించా లన్నారు. బదిలీ అయిన వారందరిని శాలువా, మెమెంటో, పూల దండలతో సన్మానించారు. అనంతరం సచివాలయ సిబ్బంది సర్పంచ్ నాగముత్యమాంబ, బాబులను సత్కరించారు. కార్యక్రమంలో వైయస్ సర్పంచ్ తలగం శెట్టి శ్రీదేవి, వాసు, వీఆర్వో చిరంజీవి, పిట్ట రామారావు, రాంబాబు, పంచాయతీ సెక్రెటరీ ఎస్. రాజు గ్రామస్తులు పాల్గొని సిబ్బందికి వీడ్కోలు పలికారు.

## ఆక్వా రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

– ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు



పాలకొల్లు, మేజర్ న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులను ఆదుకోవాలని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు కోరారు. అమెరికా ఆక్వా ఎగుమతులపై 25శాతం సుంకం విధించడం వల్ల ఆక్వా రైతు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని అన్నారు, ఒక్క అమెరికా మినహా మిగిలిన దేశాలన్నీ తక్కువ విధిస్తున్నాయని దీనినే ఆసరాగా చేసుకుని ఎగుమతి దారులు ఆక్వా రైతు వద్ద తక్కువ ధరకు రొయ్యలు కొనుగోలు చేయడంతో సన్న , చిన్న ఆక్వా రైతులు నష్టాలు ఊబిలో కూరుకుపోతున్నారని కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై చర్చించి న్యాయం చేయాలన్నారు, 100 కౌంట్ రొయ్యలకు 260 రూపాయలు వుండే రేటును 20 రూపాయల తగ్గించి కొనుగోలు చేయడంతో మరింత నష్టపోతున్నారని, ప్రభుత్వం తరపున అప్సర ఆక్వా రైతులతో మీటింగ్ వేసి చర్చించాలని కోరారు, ఈ శాఖకు సంబంధించిన మంత్రి అచ్చం నాయుడుకు ,మంత్రి నిమ్మల రామానాయుడు కు మెమోరాండాలను అందజేయన్నట్లు చెప్పారు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని న్యాయం చేయాలని, ఆక్వా జోన్ నాన్ ఆక్వా జోన్ అనే నిబంధన పెట్టి యూనిట్కు రూపాయి నర కరెంటు రాయితీలు కొందరికి వస్తున్నాయని, రైతులు ఏప్రిల్ మే నెలలో పంటలు వేయకుండా డ్రైడేగా ప్రకటించాలని లేకుంటే మరింత నష్టాలు రైతు పరిస్థితి దయానింగా మారుతుందని గాంధీజీ అన్నారు, ఈ కార్యక్రమంలో బోనం చినబాబు, తదితరులు పాల్గొన్నారు,

## 22న సామూహిక వరలక్ష్మీ వ్రతములు




ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: చిన్న వెంకన్న ఆలయ అనివేటి కళ్యాణ మండపం ఆవరణలో ఆగస్టు 22వ తేదీ సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరుగుతాయని ఆలయ ఈవో ఎన్వి సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించు కోవలసినదిగా తెలియజేశారు.

# విద్యార్థుల స్వేచ్ఛని హరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

– భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)





**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఎస్ఎఫ్ఐ ఏలూరు సిటీ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్ శివాజీ, కార్యదర్శిగా బీ.మానోజ్ ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా ఎం జయంతు వీరబాబు సహాయ కార్యదర్శిగా ఎం శివ ఎల్ రాజేష్ మరో ఆరుగురు సిటీ సభ్యులుగా ఉన్నారు. ఏలూరు సిటీ కార్యదర్శి బి మనోజ్ సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారని ఈ జీవోలు అమలు అయితే ప్రభుత్వ పాఠశాలలో ఏం జరుగుతుందో అనే విషయం కూడా బయటకు తెలియదు కార్పొరేట్ విద్యా వ్యవస్థలో విద్యార్థులు పై పెట్టే ఒత్తిడి కూడా బయటకు తెలియదని విద్యార్థులు చనిపోతే దానికి కారణం ఈ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ జీవో తీసుకోవడం చాలా ముఖ్య ఉద్దేశం చైతన్య నారాయణ విద్యా సంస్థల్లో ఇప్పటికి అనేకమంది విద్యార్థులు మానసిక ఒత్తిడి గురై చనిపోయిన వారు ఉన్నారు అనారోగ్యం పాలైన వారు ఉన్నారు వాళ్ళ కాపాడటానికి ఈ జీవో ఉపయోగపడుతుందని కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడితరంగా దోచుకోవడానికి మంత్రి నారా లోకేష్ అవకాశం ఇచ్చారని ఆరోపించారు. నగర అధ్యక్షులు ఎస్ శివాజీ మాట్లాడుతూ ఏలూరు పట్టణంలో హాస్టల్లో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. అమీనా పేట ఆడపిల్లలు హాస్టల్కు ప్రహరీ గోడ సరిగా లేకపోవడం వల్ల ఆడపిల్లలకు రక్షణ కరువైంది పాత జెడి ఆఫీస్ వెనక భాగంలో గోడ కూలిపోయి ఉంది ఆ మార్గం నుండి గతంలో యువకులు వచ్చారని అప్పుడున్న ఎఎస్‌డబ్ల్యూకి సమాచారం ఇచ్చాం ఎస్ఎఫ్ఐగా ఇప్పటివరకు ఆ పహరీ కూడా పూర్తి చేసింది లేదు ఏ విద్యార్థి కైనా ఏమన్నా జరిగేంతవరకు కూడా అధికారులు చూస్తూ ఉంటారా వెంటనే అపహరీ గోడని పూర్తిచేసి ఆడపిల్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఎం జయంత్ వీరబాబు సహాయ కార్యదర్శి శివ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షణసైన్యం చర్చిలో స్నేహితుల దినోత్సవ వేడుకలు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు నగరంలోని ఆదివారపుపేటలో రక్షణ సైన్య సెంట్రల్ కోర్ చర్చిలో స్నేహితుల దినోత్సవ వేడుకలు గృహసమితి ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వేడుకగా జరిగాయి. సంఘ కాపరి కెప్టెన్ నీలా రత్నకుమార్ కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. గృహసమితి ట్రెజరర్ లీనా ప్రశాంతి, కెప్టెన్ నీలా సుకన్యరాయ్ లు స్వీట్లు పంచారు. అనంతరం దేవుని వాక్య పరిచర్యను అందించారు. 1907వ సంవత్సరంలో రక్షణ సైన్య వ్యవస్థాపకులైన జనరల్ విలియం బూత్, కోడలు ఫ్లోరెన్స్ బూత్ ఈగృహసమితి ప్రారంభించారని, ఆరాధన, విద్య, సేవ, సహవాసం అను నాలుగు విధానాలతో నేడు 134 దేశాలకుపైగా రక్షణ సైన్య స్త్రీలపరిచర్యముందుకు కొనసాగుతోం దన్నారు. ఇందులో ప్రధానంగా స్నేహ భావం ఎక్కువగా ఉంటుందన్నారు. చివరిగా గృహ సమితి వారి కొరకు,సంఘం కొరకు కల్నల్ మాణిక్యమ్మ ప్రార్థించి దీవెనలు అందించారు. ఈకార్యక్రమంలో సంఘపెద్దలు,గృహ సమితివారు, యవనస్తులు, సంఘంలో ఉన్న విశ్వాసులు అందరూ తమ సహకారం అందించారు.

# అన్నిబంధాల కంటే స్నేహబంధం చాలా గొప్పది






**– గతించిన వారి స్మృతులు స్మరించుకోవడం విశేషం**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** అన్నిబంధాల కంటే స్నేహబంధం చాలా గొప్పదనీ, గతించిన వారి స్మృతులను స్మరించుకుంటూన్నారిని పొందడం ఎంతో గొప్పవిషయమని జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ,ఎమ్మెల్యే బడేటి చంటి అభిప్రాయపడ్డారు. ఆత్మీయతతో పెనవేసుకున్న స్నేహబంధం శాశ్వత ఆయుష్షుతో జీవించడమే కాకుండా ఎందరిస్నేహానికో జీవం పోస్తోందని అభివర్ణించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఏలూరు అశోక్‌నగర్‌లోని కెపిడిటి హైస్కూల్‌లో ఆదివారం ఫ్లాష్ టీం ఆధ్వర్యంలో జయహో స్మరణోత్సవం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. తొలుత దివికేగిన ఆత్మీయుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. నల్లబెలూన్‌లు ఎగురవేశారు. అనంతరం ఫ్లాష్ టీంకు దాతలు అందించిన ప్రీజర్ బాక్స్‌లను,మొక్కలతో కూడిన ట్రీగార్డులను రిబ్బన్ కట్‌చేశారు. ఈసందర్భంగా పలువురు యువతులు స్నేహబంధానికి సంబంధించి సన్నివేశాలను ప్రదర్శించగా ఆహూతుల కళ్ళుచెమర్చాయి. అనంతరం జరిగిన సభలో జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మన మధ్య లేని వారి మైత్రికి గుర్తుగా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఎంతో అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అశువులుబాసిన ఆత్మీయులతో ఉన్న క్షణాలను తిరిగి గుర్తు చేసుకున్నాన్నారు. సమాజ సేవ కోసం పరితపించే సంస్థ ఫ్లాష్ అని అభినందించారు. తన తండ్రి బడేటి శ్రీహరిరావు,ఆయన మిత్రులు మామిళ్ళపల్లి గంగరాజుల మధ్య విడదీయరాని స్నేహబంధం ఉండేదని గుర్తుచేసుకున్నారు. అటువంటి గొప్ప స్నేహం విలువ, మంచి స్నేహితుల బంధం కలకాలం నిలిచిపోవడంతో పాటూ, నేటితరం వారికి ఆ స్ఫూర్తిని తెలియజెప్పేందుకు కూడా ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ గంట పద్మశ్రీ ప్రసాద్,ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఫ్లాష్ ప్రతినిధులు యర్రంశెట్టి శ్రీనివాస్, నాగేశ్వరరావు,కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, చల్లా వెంకట సత్యవర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**– ఐద్వా కార్యదర్శి జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ**



**యలమంచిలి, మేజర్ న్యూస్:** పరుగెడుతున్న నేటి కంప్యూటర్ రంగంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. మండలంలోని చించినాడ శెట్టి బలిజ రామాలయం వద్ద తెన్నేటి లక్ష్మి ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఐద్వా యలమంచిలి మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి పూర్ణ మాట్లాడుతూ ఈ సృష్టిలో ఆడజాతి లేకపోతే మగ జాతికి మనుగడ లేదన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన మహిళలు నేటి సమాజానికి ఎంతో అవసరం అన్నారునేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అభ్యుదయ భావాలు కలిగిన మహిళలు అంతా ఖండించాలని కోరారు. నేడు మహిళలు, చిన్నారులపై ఘోరంగా అన్నారు. అత్యాచారాలు ఎక్కువ జరుగుతున్నా యన్నారు రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుంది అన్నారు. మద్యం మత్తులోనే కామాంధులు పేట్రేగిపోతున్నా రన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్మిక చట్టాలను కాలరాసే విధంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో చించినాడ, కలగంపూడి తదితర గ్రామాల నుంచి మహిళా సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అన్నిరంగాల్లో యువత జయకేతనం ఎగురవేయాలి

**– ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఎమ్మెల్యే బడేటి చంటి**




**ఏలూరు,మేజర్ న్యూస్ :** దేశాన్ని క్రీడల్లో నెంబర్ వన్ స్థానానికి తీసుకెళ్ళాలన్నదే దేశ ప్రధాని నరేంద్రమోదీ ఉన్నతాశయమని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఇండోర్ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ ట్రెయినింగ్ సెంటర్ హాల్లో ఆదివారం ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ జిల్లా స్థాయి పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ పటిష్టవంతమైన నాయకత్వంతో,మంచి ఉన్నతాలోచనతో భారత్ విజయపరంపరను కొనసాగిస్తోందన్నారు. అన్నిరంగాల్లో యువత జయకేతనం ఎగురవేసి, దేశఖ్యాతిని మరింత ఇనుమడింపచేయాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన అని చెప్పారు. దీనిలో భాగంగానే యువత క్రీడల్లో రాణించాలనే సదాలోచనతోనే అనేక పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించిన వారు దేశస్థాయిలో కూడా గెలుపొంది, జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆయన ఆకాంక్షించారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బడేటి అంటే వెయిట్ లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్ అంటే బడేటి అని అభివర్ణించారు. వెయిట్‌లిఫ్టింగ్‌ను ఎంచుకున్న వారు భవిష్యత్తులో అనుకున్నది సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బడేటి వెంకట్రామయ్య, ఏపి వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి టి.దీన్నాబాబు,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ దృష్టికి 'పోలవరం' పంచాయతీ?





ఏలూరు,మేజర్ న్యూస్ : పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పై వస్తున్న అవినీతి ఆరోపణల అంశం జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి చేరినట్లు సమాచారం. ఈ పంచాయతీ పార్టీ పెద్దల చేతుల్లోకి వెళ్ళటంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నియోజకవర్గ ప్రజల్లో నెలకొంది. ఎన్నికలకు ముందు నుండి తన గెలుపునకు కూటమి నాయకులే అడ్డుపడుతున్నారని, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అప్పట్లోనే చిర్రి బాలరాజు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. అదిష్టానం కూడా కలిసికట్టుగా పనిచేయాలని, కూటమి అభ్యర్థిని గెలిపించాలని తెలుగుదేశంపార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.నాయకులను మందలించడం జరిగింది. కూటమి నాయకులు చేసే ప్రచారాలను మొదట్లోనే అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లడంతో ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా అధిష్టానం పట్టించుకోవడం లేదు సరి కదా అండగా మేమున్నా మనే భరోసా బాలరాజుకి ఇచ్చింది. ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుండి ఎమ్మెల్యే చిర్రి బాలరాజుని టార్గెట్ చేయడం ఇప్పటికి ఇది మూడోసారి. ప్రస్తుతం మాజీ మంత్రి దేవినేని ఉమా,మాజీ డిసిసిబి చైర్మన్ రాంబాబు మధ్య సాగిన ఫోన్ సంభాషణ సాధారణంగా మాట్లాడుకునే మాటలు తప్ప పట్టించుకోవలసిన అవసరం లేదనే సంకేతాలు పార్టీ అధిష్టానం నుండి వచ్చినట్లు తెలిసింది.

ఇటువంటి మాటలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పై కావాలనే దుష్ప్రచారం చేసి బురద చల్లాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి అధిష్టానం కూటమి నాయకులకు చెక్ పెట్టేలా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గంలో 100 కోట్లు ఆదాయం వస్తుందా,? ఆదాయం వచ్చే వనరులు ఎక్కడున్నాయి వంటి ప్రశ్నలుప్రజలను సందిగ్ధంలో పడేశాయి.

అభివృద్ధిని చూసి ఓర్వలేకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టటం వీధిలో ఒక్క ఇల్లు ఉన్న సిసి రోడ్డు వేశారు. ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారులకు బీటీ రోడ్లునిర్మాణం చేపట్టారు. గతంలో మాజీ ఎమ్మెల్యే మొడియంశ్రీనివాసరావు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినప్పటికీ సొంత పార్టీ నేతలే ఆయనపై లేనిపోని ఆరోపణ చేశారని ఇప్పుడు అదే బాటలో ప్రస్తుత ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై ఆరోపణలు మొదలుపెట్టారని పలువురు భావిస్తున్నారు.

**– ముక్కుసూటి తనానికే శత్రువులు ? – ఎమ్మెల్యే చిర్రి బాలరాజు** ముక్కు సూటిగా వ్యవహరించడం కొందరికి మింగుడు పడడం లేదని తెలిసింది. దీంతో ఆయనకు శత్రువర్గం కూడా పెరిగిందనే చెప్పాలి. గతంలో పనిచేసిన ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం ప్రస్తుత ఎమ్మెల్యే ఇందుకుభిన్నంగాఉండి అన్ని విషయాల్లో దూసుకుపోవడం కొందరికి నచ్చడం లేదని చెబుతున్నారు.దీంతో కూటమి నాయకులే శత్రువులుగా మారారనినియోజకవర్గప్రజలు చర్చించుకుంటున్నారు

**– కాయలు కాసే చెట్టుకే రాళ్లు –** ఎంతమంది ఎన్ని ఆరోపణలు చేసినప్పటికీ వాటన్నిటిని ఎదుర్కొంటూనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. చిర్రి బాలరాజు ఎదుర్కొంటున్న ఆరోపణలు కంటిమీద కునుకు లేకుండా చేసేవే. అయినప్పటికీ నిరుత్సాహం చెందకుండా, మనోధైర్యం కోల్పోకుండా ధీటుగా సమాధానం చెబుతూనే ఉన్నారు. ఈసారి పంచాయితీ అధిష్టానం చేతుల్లోకి వెళ్లడంతో రచ్చకెక్కించిన చోటానాయకులపై చర్యలు గట్టిగానే ఉంటాయని ప్రజలు చెప్పుకుంటున్నారు.

# జోగాడ ఉమామహేశ్వరరావుకు పలువురి అభినందనలు



పాలకొల్లు,మేజర్న్యూస్ :రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమం నిర్వహిస్తూ పేద వృద్ధులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా 2025-మధర్ థెరిస్సా జాతీయ పురస్కారం అందుకోబోతున్న జోగాడ ఉమామహేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించిన ఆయన మిత్రులు,రాష్ట్ర వైసిపి ప్రచార విభాగం ప్రదాన కార్యదర్శి పెచ్చేటి కృష్ణాజి,వైసిపి యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్,వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీరా మల్లికార్జునుడు, సివియర్ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు,గొర్రెల రాంబాబు, రామానుజుల చిన మదు, వాసం శెట్టి సుబ్బారాయుడు, రాపాక శివకుమార్, వడ్డి సంజయ్,బొంతు వెంకట నరశింహరాజు,పసుపు లేటి రాజు తదితరులు.

# మత్స్యకారుల సమస్యలపై త్వరలో రాష్ట్ర పర్యటన

**– రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు**



**నరసాపురం,మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొం టున్న సమస్యలు తెలుసుకునేందుకు త్వరలో రాష్ట్ర పర్యటన చేపట్టనున్నట్లు రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు తెలిపారు. ఆదివారం నర్సాపురంలో ఆయన 'సూర్య ' ప్రతినిధి తో మాట్లాడారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్లు తీర ప్రాంతం విస్తరించి ఉన్నదని, మూడు వేల పైన గ్రామాల్లో మత్స్యకారులు జీవిస్తున్నారని ఆయన తెలిపారు. చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మత్స్యకార గ్రామాల్లో పర్యటించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ప్రధానంగా మత్స్యకారులు జీవిస్తున్న గ్రామాల్లో గురుకుల పాఠశాలలు లేకపోవడం వల్ల ఆ కుటుంబాల విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి కాలేకపోతున్నారని ఆయన తెలిపారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే వారికి మోటార్ సైకిల్, మిగిలిపోయిన చేపలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ లో అవసరం అన్నారు. చిన్న వ్యాపారులకు లక్ష వరకు రుణం ఇస్తే వారు అభివృద్ధి అయ్యేందుకు అవకాశం ఉంటుంది అన్నారు. 2016లో అప్పటి మంత్రి నారా లోకేష్ బియ్యపు తిప్పలో శంకుస్థాపన చేసిన ఫిషింగ్ హార్బర్ను అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. తాజాగా కేంద్ర బృందం వచ్చి సముద్ర శివారు గ్రామమైన బియ్యపు తిప్పలోనే ఫిష్ ల్యాండ్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలన చేసిందని పెద్దిరాజు తెలిపారు. రూ13కోట్లతో ఏర్పాటు చేసేందుకు కేంద్ర బృందం పరిశీలించింద న్నారు. ఇది కార్యరూపం దాలిస్తే అనుబంధంగా కోల్డ్ స్టోరేజ్లు, చిన్నపాటి వ్యాపారాలు అభివృద్ధి అవుతాయని అన్నారు.

బియ్యపు తిప్ప నుండి వేములదీవి వరకు వాహనాల రాకపోకలకు వెడల్పు రోడ్డు నిర్మించవలసి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటన అనంతరం మత్స్యకారులకు కావలసిన అవసరాలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,నారా లోకేష్, ఫిషరీస్ మంత్రి తదితరులకు నివేదిక అందిస్తామని పెద్దిరాజు తెలిపారు.

# యువత ఆదర్శవంతంగా అభివృద్ధి చెందాలి

**– ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్**



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** యువత పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తూ స్వయం సమృద్ధి తో మరికొందరికి జీవనో పది కల్పించే దిశగా ముందుకు అడుగులు వేయాలని బొలిశెట్టి శ్రీనివాస్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్, భవన నిర్మాణ ఇతర కార్మికసంఘ చైర్మన్ వలవలబాబ్జి పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురం లో నూతనం గా నిర్మించిన అపర్ణ ఎంటర్ప్రైజెస్ వాటర్ ప్లాంట్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత ఈ దిశగా ముందుకు అడుగులు వేయాలని సూచించారు. నాణ్యమైన మంచినీరు అందరికీ అందించే దిశగా ఈ ప్లాంట్ నిర్వహణ సాగాలని తెలిపారు. ఈసందర్భంగా ప్లాంట్నిర్వాహకుడు కాకర్లకిట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, ఆరుగొలను సొసైటీ మాజీ చైర్మన్ రెడ్డి రాము, మాజీ ఎంపీపీ కాకర్ల రమాదేవి ప్రభాకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక సేవారంగంలో అన్ని వర్గాల ప్రజలకు విశిష్ట సేవలు



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** మానవత సంస్థ ద్వారా సామాజిక సేవారంగం లో అన్ని వర్గాల ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న మానవతా పెను మంట్ర శాఖ కార్యదర్శి బండి ప్రసాద్ కు మానవత ఫౌండర్ సి.రామచంద్రా రెడ్డి అభినందన జ్ఞాపిక అందించారు. ఆదివారం నల్లజర్లలో జరిగిన మానవతా సంస్థ జిల్లాసదస్సులో ఈ గౌరవం కార్యదర్శికి దక్కిందని శాఖ అధ్యక్షులు శిరం విశ్వనాథం ఇక్కడ తెలిపారు.మానవత విలువలుతో కూడిన సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకుగాను జ్ఞాపక ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా పెనుమంట్ర మండలలో చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి సదస్సులో వివరించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెనుమంట్ర శాఖ నుండి చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, పూర్వాధ్యక్షులు కర్రి కృష్ణా రెడ్డి, ట్రెజరర్ అమృత వాక్కుల సత్యనారాయణ,రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, ఈసి ఎడ్యుకేషన్ పడాల సువర్ణ గౌరి పాల్గొన్నారన్నారు.

# శాంతిభద్రలతో పాటు సామాజిక అభివృద్ధిలో పోలీసులు



**కైకలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాలపై కైకలూరు టౌన్ పోలీసులు సామాజిక బాధ్యతతో కూడిన చక్కటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ఇన్స్పెక్టర్ కృష్ణ,ఎస్ఐలు ఆర్. శ్రీనివాస్, వెంకట కుమార్ కలిసి స్థానిక టౌన్గర్ల్స్ హైస్కూల్ను సందర్శించిన సమయంలో, హెడ్ మాస్టర్ ,విద్యార్థినులు తమ సమస్యలను వివరించారు. పాఠశాల ప్రాంగణం చుట్టూ పొదలు అధికంగా ఉండడం వల్ల విషపూరిత పాములు, ఇతర క్రిములు సంచరించే ప్రమాదం అధికంగా ఉండడంతో విద్యార్థుల్లో భయాందోళన నెలకొంది అని వారు తెలియజేశారు.

ఈ నేపథ్యంలో, స్వరాంధ్రప్రదేశ్ ఉద్యమంలో భాగంగా, సీఐ,ఎస్ఐల ఆధ్వర్యంలో ఆదివారం జెసిబి ద్వారా స్కూల్ చుట్టూ ఉన్న పొదలను తొలగించడం జరిగింది.దీనివల్ల పాఠశాల పరిసరాల్లో పాములు, క్రిముల భయం తొలగింది. విద్యార్థినులు భయంతో కాకుండా సురక్షిత వాతావరణంలో చక్కగా చదువుకునే అవకాశం కలిగింది. పోలీస్ శాఖ శాంతి భద్రతలతోపాటు సామాజిక అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి పాఠశాల సిబ్బంది,విద్యార్థులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ పోలీస్ అధికారులను అభినందించారు.